సాక్షి
వికారాబాద్

గురువారం । 25 । మే । 2023



రైతులకు చైతన్యమేదీ?
ఈసారి రైతు చైతన్య యాత్రల ఊసేలేదు.. రైతులకు తోచిన విధంగా వ్యవసాయం చేస్తూ నష్టాల బారిన పడుతున్నారు. 8లో▸



'భగీరథ'.. ఊరూరా వ్యథ!
మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలు న్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ముక్తకంఠంగా తెలిపారు. 8లో▸



రియల్టర్లపై చర్యలు తీసుకోవాలి
అక్రమంగా రోడ్డును తవ్వేసిన రియల్టర్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

గృహప్రవేశానికి రండి..

సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే ఆహ్వానం



సీఎం కేసీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి

తాండూరు టౌన్ : పట్టణంలో నిర్మించిన నూతన గృహ ప్రవేశానికి సీఎం కేసీఆర్‌ను ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా వెళ్లి హైదరాబాద్‌లో సీఎంకు ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే నెల 7న నూతన గృహ ప్రవేశం జరగనుంది. ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో ఎమ్మెల్యే తండ్రి విఠల్ రెడ్డి, తల్లి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రమోదిని రెడ్డి, సోదరుడు రితీష్ రెడ్డి ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అనంతగిరి: వికారాబాద్ మండలం అత్వెల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ సత్తయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పొలాలకు వెళ్లే రోడ్డును, కాల్వల పూడిక తీత పనులను పరిశీలించారు. 535 కూలీలు పనిచేస్తున్నారు. రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులో గ్రామం నుంచి పొలాలకు రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోహన్, ఈసీ నవీన్, టీఏ రాములు తదితరులు పాల్గొన్నారు.

పట్టణ పేదలకు 'ఉపాధి' కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న దళిత బహుజన శ్రామిక యూనియన్ సభ్యులు

కొడంగల్ రూరల్ : జాతీయ ఉపాధిహామీ పథకంలో పట్టణ పేదలకు పనులు కల్పించాలని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగం సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని హుస్సేన్‌పూర్ గ్రామ శివారులో ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కరపత్రాలను ఆవిష్కరించారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పనులను ఎత్తి వేయాలని కుట్ర చేస్తోందని అన్నారు. పనులు అమలవుతున్న గ్రామాలను కొత్తగా నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కలుపుతూ పట్టణం పేరుతో కూలీలకు పనులను నిలిపివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన పనులకు చట్ట ప్రకారం వేతనాలు ఇవ్వకుండా అరకొర వేతనాలు అందిస్తూ కూలీలను ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నదని అన్నారు. గతంలో గ్రాపంచాయతీలు ఉండే గ్రామాలను మున్సిపాలిటీల్లో చేర్చడంతో కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. కేరళ రాష్ట్రంలో మాదిరి ఇక్కడ కూడా పట్టణ పేదలకు ఉపాధి పనులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దళిత బహుజన శ్రామిక యూనియన బొంరాస్‌పేట ఇన్‌చార్జి వేణుగోపాల్, కూలీలు నర్సప్ప, మొగులప్ప, సావిత్రమ్మ, అంజిలప్ప, బాలప్ప, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సీసీఐని సందర్శించిన సీఎండీ

సిమెంట్ ఉత్పత్తులపై ఆరా

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ శివారులో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఫ్యాక్టరీని బుధవారం సీఎండీ సంజయ్ బంగా సందర్శించారు. ఢిల్లీలోని కేంద్రా కార్యాలయం నుంచి కరన్‌కోట్‌కు చేరుకొని ఫ్యాక్టరీలో ఆయా విభాగల హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఆయా విభాగాల ప్రతినిధులతో మాట్లాడి సిమెంట్ ఉత్పత్తులపై ఆరా తీశారు. సీఎండీ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో రోజు 3 వేల టన్నుల సిమెంట్ ఉత్పత్తి అవుతోందన్నారు. 20 రోజుల క్రితం కంపెనీలో మరమ్మతులు కొనసాగాయన్నారు. మార్కెట్లో సీసీఐ సిమెంట్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు.

కార్మికుల సంఖ్య తగ్గించాలి

సీసీఐ ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల సంఖ్యను తగ్గించే విధంగా చూడాలని జీఎం మహేశను సీఎండీ సంజయ్‌బంగా ఆదేశించారు. అలాగే సిమెంట్ ఉత్పత్తులు పెరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

రైతులకు 'గన్నీ' అవస్థలు

బస్తాలు లేక ఇళ్ల మధ్యే ధాన్యం రాశులు

- వానొస్తే రైతులకు తప్పనితిప్పలు
- కొనుగోలు కేంద్రంలోనూ పేరుకున్న ధాన్యం బస్తాలు



ధాన్యం రాశులపై కప్పిన పాలిథిన్ కవర్లు గాలికి ఎగిరిపోకుండా వాటిపై వేసిన చెట్ల కొమ్మలు



నాగారంలో గన్నీ బస్తాల కోసం బారులుదీరిన రైతులు

ధారూరు: గన్నీ బ్యాగులు అందక రైతులు పడుతున్న పాట్లు అన్నీఇన్నీ కావు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించడానికి అవస్థలు తప్పడంలేదు. చేసేదిలేక కొందరు రైతులు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో, కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం రాశులు పోశారు. ధాన్యం రాశులు ఎండకు ఎండుతున్నాయి.. వానకు తడుస్తున్నాయి. దాదాపు 50 వేల సంచులకు సరిపడా ధాన్యం రాశులున్నాయంటే గన్నీ బ్యాగుల కొరత ఎంతగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా ఉంటే సేకరించిన ధాన్యం తరలింపులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. మండల పరిధిలోని నాగారంలో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 750 సంచుల ధాన్యాన్నే మిల్లులకు తరలించారు. ఇంకా 24,250 ధాన్యం బస్తాలు కొనుగోలు కేంద్రంలోనే ఉన్నాయి. నిత్యం లారీల కోసం ఎదురుచూస్తున్నామని కొనుగోలు సిబ్బంది తెలిపారు. గన్నీ బ్యాగుల కొరతతో ఆరుబయట ఆరబెట్టిన ధాన్యంతో ఇబ్బందులు పడుతున్నామని, వానొస్తే అవస్థలు తప్పడం లేదని రైతులు తెలిపారు. ఈ విషయంపై సీఈఓ నర్సింహులు స్పందిస్తూ ఇప్పటి వరకు 22వేల బస్తాలను రైతులకు అందించామన్నారు. ఇంకా బస్తాలు రావాల్సి ఉందన్నారు. అటు లారీల రాక, ఇటు గన్నీ బ్యాగుల లేక కొనుగోలు సిబ్బంది, రైతులు ఇబ్బందులు పడుతున్నది వాస్తవమేనని అన్నారు.

కల్లాల పైసలేవీ?

నిర్మాణానికి అప్పులు.. బిల్లులు రాక తిప్పలు

- రెండేళ్లు గడిచినా అందని డబ్బులు
- దృష్టిసారించని ప్రభుత్వం
- జిల్లాకు 3,261 నూర్పిడి కల్లాలు మంజూరు
- పూర్తయినవి 230 మాత్రమే
- మధ్యలో ఆగినవి 500
- ఇంకా పనులు ప్రారంభానికి నోచుకోనివి 2,531
- బిల్లుల జాప్యంతో నిర్మాణాలకు ఆసక్తిచూపని రైతులు



ఉపాధి హామీ పథకంలో భాగంగా పరిగి మండలం రంగాపూర్‌లో రైతు నిర్మించిన కల్లం

వికారాబాద్: పరిగి మండలం చిట్యాల్ గ్రామానికి సీసీతో నిర్మించుకునేందుకు మొత్తం 16 కల్లాలు ఉపాధి హామీ పథకం కింద మంజూరయ్యాయి. ఏడాదిన్నర క్రితం ఆరుగురు రైతులు సొంత డబ్బులు వెచ్చించి కల్లాలు నిర్మించుకున్నారు. ఇందుకు ఒక్కోరైతు రూ.85 వేలు ఖర్చుచేశారు. అప్పులు తెచ్చి మరీ నిర్మించారు. మిగతా రైతుల వద్ద డబ్బులు లేకపోవటంతో వేచిచూశారు. కాగా నిర్మించుకున్న ఆరుగురు రైతులకు ఇప్పటివరకు బిల్లులు రాలేదు. దీంతో డబ్బులు రావడంలేదని భావించిన ఆ గ్రామానికి చెందిన మిగతా పది మంది రైతులు కల్లాలు మంజూరైనా నిర్మించుకోలేదు. ఇలా చిట్యాల గ్రామమే కాదు జిల్లా అంతటా ఇదే పరిస్థితి నెలకొంది. రైతులు పంట నూర్పిడుల కోసం మంజూరు చేసిన కల్లాల పథకం అభాసుపాలవుతోంది. ఎంతో మంచి ఉద్దేశంతో ప్రారంభించిన ఈ పథకం అమలులో చిత్తశుద్ధి కానరావడం లేదు. రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కల్లాలు మంజూరు చేసింది.18 మండలాల్లో మొత్తం 3,261 కల్లాలు మంజూరు అయ్యాయి. ఇందులో 230 కల్లాలు పూర్తయ్యాయి. మరో 500 కల్లాలు నిర్మాణ దశలో ఉన్న సమయంలో బిల్లులు రాకపోవటంతో మధ్యలోనే వదిలేశారు. ఒక్కో కల్లానికి రూ.85 వేలు చెల్లించాల్సి ఉండగా ఏ ఒక్క రైతుకు మొత్తం డబ్బులు ఇచ్చిన పాపాన పోలేదు. చాలా మంది రైతులకు మంజూరు అయినప్పటికీ కల్లాలు నిర్మించుకునేందుకు ముందుకు రావడంలేదు. జిల్లాలో 2,531 కల్లాలు ప్రారంభం కాకుండానే వెనక్కి వెళ్లే పరిస్థితి నెలకొంది. కల్లాల నిర్మాణం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల ప్రకారం వ్యవహరించలేదంటూ తాము డబ్బులు ఇవ్వబోమని కేంద్రం చేతులెత్తేసింది. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్రం నిర్ణయాన్ని నిరసిస్తూ ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. అనంతరం కల్లాల డబ్బులు తామే చెల్లిస్తామని ప్రకటించారు. కానీ మళ్లీ డబ్బుల చెల్లింపు ఊసెత్తడంలేదు. దీంతో కల్లాలు నిర్మించుకున్న రైతుకు డబ్బులు వస్తాయా? రావా అనే విషయంలో సందిగ్ధత నెలకొంది.

రెండేళ్లుగా అందని బిల్లులు

గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. చేసే పనులు ఏవైనా బిల్లులు మాత్రం సకాలంలో చెల్లించడంలేదు. ఇదే తరహాలో రెండేళ్ల క్రితం ఉపాధి హామీ ద్వారా రైతులు పొలాల వద్ద కల్లాలు నిర్మించుకునేలా పథకాన్ని రూపొందించారు. ఒక్కో కల్లానికి రూ. 85 వేలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందులో కొంత డబ్బులు మ్యాన్‌డేస్ ఆధారంగా మిగతా డబ్బులు మెటీరియల్ కాస్ట్ రూపంలో చెల్లిస్తామని అధికారులు తెలిపారు. అయితే నిర్మించుకుని రెండేళ్లు గడిచినా బిల్లులు మాత్రం రావటంలేదు. ప్రారంభంలో హడావిడి చేసిన నేత లు బిల్లుల చెల్లింపులో జరుగుతున్న జాప్యాన్ని మా త్రం ఎవరు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు సైతం రైతుల గోడు పట్టించుకోవటం లేదు. బిల్లులు చేసి ప్రభుత్వానికి పంపించామని చేతులు దులుపుకుంటున్నారు.

> **బిల్లులు చేసి పంపించాం**
>
> జిల్లాలో కల్లాలు మంజూరైన వాటిలో చాలా వరకు ఇంకా పనులు ప్రారంభించని మాట వాస్తవమే. పూర్తయిన వాటికి సంబంధించి బిల్లులు చేసి పంపించాం. ప్రభుత్వం బిల్లులు విడుదల చేసిన వెంటనే ఆ డబ్బులు రైతుల ఖాతాలోకే వస్తాయి.
>
> – కృష్ణన్, పీడీ, డీఆర్డీఏ

ధాన్యం కొనుగోళ్లు వేగిరం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

- రైస్ మిల్లర్లకు సకాలంలో తరలించండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వరి ధాన్యం కొనుగోళ్లను వేగిరం చేయాలని, రైస్ మిల్లర్లకు సకాలంలో ధాన్యాన్ని తరలించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, సంస్థ చైర్మన్ రవీందర్ సింగ్‌లు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని ధాన్యం సేకరణ విషయాలను వివరించారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో కనీసం మూడు చొప్పున తూకం యంత్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైనంత హమాలీలను ఏర్పాటు చేసి వెంటనే వాహనాల ద్వారా ధాన్యం తరలించాలని సూచించారు. ధాన్యం సేకరణకు రోజు కనీసం 320 ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను వినియోగించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యాన్ని సేకరించాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, డీఆర్ఓ అశోక్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, మేనేజర్ విమల తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ చాంపియన్‌షిప్ రెఫరీగా పాషా

షాద్‌నగర్‌రూరల్: పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో నిర్వహించే 45వ సబ్ జూనియర్ జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రెఫరీగా పట్టణానికి చెందిన వాలీబాల్ కోచర్ పాషాభాయ్ ఎంపికయ్యారు. బుధవారం వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఎంపిక పత్రం అందుకున్నారు.ఈ నెల 28 నుంచి నిర్వహించే ఈ పోటీలకు పాషా బాయి న్యాయ నిర్ణేతగా వ్యవహరించనున్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సెక్రటరీ హన్మంత్‌రెడ్డి, ప్రసాద్, రెఫరీ బోర్డు చైర్మన్ గణపతి, రవీందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శాంతకుమార్, హనీఫ్, చిన్నవీరయ్య, బషీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జాతీయ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు న్యాయనిర్ణేతగా ఎంపికైన పాషాబాయిని పలువురు అభినందించారు.

బీఆర్ఎస్ టికెట్ నాకే.. గెలిచేది నేనే



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, నాయకులు

- గెలుపు గుర్రాలకే టికెట్లు
- రూ.2,700 కోట్ల నిధులో అభివృద్ధి పనులు చేపట్టా
- త్వరలో పల్లెపల్లెకూ పట్నం కార్యక్రమం చేపడతా
- ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు: బీఆర్ఎస్ పార్టీ గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయిస్తుందని ఎమ్మెల్సీ పట్నం నరేందర్ రెడ్డి అన్నారు. పార్టీ తాండూరులో నిర్వహించిన సర్వేలో తనకే అనుకూలంగా ఉందని అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, బషీరాబాద్ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డిలతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సర్వేల ఆధారంగానే సీఎం కేసీఆర్ పార్టీ టికెట్లు కేటాయిస్తారన్నారు. తాండూరు ఎమ్మెల్యేగా నాలుగు సార్లు గెలిచానని అన్నారు. 1994 నుంచి ఇప్పటి వరకు రూ.వేల కోట్లతో తాండూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అన్నారు. కొందరు డూప్లికేట్ నేతలు తాను అభివృద్ధి చేయలేదంటూ మాట్లాడుతున్నారన్నారు. నియోజకవర్గానికి రూ.2,700 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. జాతీయ రహదారి మంజూరు చేయించి పనులు పూర్తి చేయించామన్నారు. రాష్ట్రంలో అంతటా జరుగుతున్న అభివృద్ధి పనులు ఇక్కడ కూడా కొనసాగుతున్నాయని, కానీ ప్రస్తుతం ఎమ్మెల్యే తానే చేపడుతున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి పదేళ్లు పూర్తి కావడంతో దశాబ్ది ఉత్సవాలను 21 రోజుల పాటు తాండూరు నియోజకవర్గంలో అట్టహాసంగా నిర్వహిస్తామన్నారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో మంజూరు చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయన్నారు. 20 ఏళ్ల పాటు తనతో ఉన్న వారంతా ఎమ్మెల్యే శిబిరంలోకి చేరారని, అయితే వారిని తానే ఎమ్మెల్యే వద్దకు పంపించానన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వారంతా తిరిగి తనవైపు వస్తారన్నారు. రాష్ట్ర ఆవిర్భావ సంబరాలు ముగిసిన వెంటనే నియోజకవర్గంలో పల్లెపల్లెకు పట్నం కార్యక్రమాన్ని ప్రారంభిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మణప్పురం రామకృష్ణ, బోయరవిరాజ్, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, యాలాల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, బిర్కట్ రఘు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, నాయకులు తదితరులున్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా వసతులు కల్పిస్తాం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

వికారాబాద్ అర్బన్: యువత చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవనంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రాణించిన విధంగానే రాష్ట్ర స్థాయి క్రీడల్లోనూ రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో క్రీడా వసతులు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు. జిల్లా స్థాయిలో మంచి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి వెళ్తున్న వారికి మంచి భవిష్యత్తు ఉన్నట్లు తెలిపారు. క్రీడలతో పాటు జూన్ 2 నుంచి 21 రోజుల పాటు రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ పది సంవత్సరాల్లో సాధించిన అభివృద్ధి ప్రతి ఒక్కరికి తెలిసేలా కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం జిల్లా స్థాయిలో గెలుపొందిన క్రీడా కారులకు కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా యువజన క్రీడల అధికారి హన్మంత్ రావు, గిరిజన సంక్షేమ అధికారి కోటాజీ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌ఎన్‌డీపీ' పనులు వేగవంతం చేయండి

- మంత్రి సబితారెడ్డి



కాలనీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ఎస్ఎన్‌డీపీ నాలా పనులను వేగవంతం చేయాలని మంత్రి సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్ 36వ డివిజన్ ఎంఎల్ఆర్ కాలనీ, 32వ డివిజన్ అయోధ్యనగర్, 31వ డివిజన్ జనప్రియ మహానగర్ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులను బుధవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలా పనులు జరుగుతున్న కాలనీల్లో రోడ్లు, తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మంత్రాల చెరువు వద్ద చేపడుతున్న వీధి వ్యాపారుల సముదాయం, వాకింగ్ ట్రాక్ బ్రిడ్జి పనులను పూర్తిచేయాలన్నారు. మంత్రి వెంట మేయర్ దుర్గ, డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ భూపాల్‌రెడ్డి, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్ నర్సింహ, డీఈ గోపీనాథ్, ఏఈ శ్రీనివాసులు, ఎస్ఎన్‌డీపీ అధికారులు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపేష్‌గౌడ్, రాజు, కాలనీవాసులు కృష్ణారెడ్డి, కృష్ణ, కిషోర్ తదితరులు ఉన్నారు. 31వ డివిజన్ పరిధి జనప్రియ మహానగర్‌లో సీసీ, బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.కోటి 50 లక్షలు, 32వ డివిజన్ పరిధిలోని కాలనీల్లో నూతన రోడ్ల నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరు చేయడంపై స్థానిక కార్పొరేటర్లు విజయలక్ష్మి, నర్సింహ, కాలనీవాసులతో కలిసి మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

27న ఆలయ పదో వార్షికోత్సవం

తాండూరు టౌన్: పట్టణంలోని కోకట్ మార్గం లో ఉన్న సాయి మందిర పదో వార్షికోత్సవం ఈ నెల 27న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5.15గంటలకు కాగడ హారతి, 7గంటలకు బాబా విగ్రహానికి క్షీరాభిషేకం, 7.30గంటల నుంచి 10గంటల వరకు హోమాలు, 12గంటలకు మధ్యాహ్న హారతి, ఒంటి గంటలకు మహా ప్రసాద అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6.15గంటలకు సంధ్యాహారతి, రాత్రి 8గంటలకు సేజ్ హారతి ఉంటుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పూజలకు హాజరవ్వాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్‌స్పెక్టర్లు

బషీరాబాద్‌లో వేణుగోపాల్ గౌడ్, పెద్దేముల్‌లో విద్యాచరణ్‌రెడ్డి


వేణుగోపాల్ గౌడ్


విద్యాచరణ్‌రెడ్డి

బషీరాబాద్: బషీరాబాద్ ఎస్ఐగా వేణుగోపాల్‌గౌడ్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. తాండూరు టౌన్‌లో ఏడాది పాటు పనిచేసిన వేణుగోపాల్‌ను ఉన్నతాధికారులు బషీరాబాద్‌కు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసిన విద్యాచరణ్‌రెడ్డిని పెద్దేముల్‌కు బదిలీపై వెళ్లారు.

పెద్దేముల్: పెద్దేముల్ ఎస్సైగా విద్యాచరణ్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అబ్దుల్‌రవూఫ్ సెలవు లో ఉండడంతో తాండూరులో పనిచేస్తున్న ఎ స్సై అన్వేష్‌రెడ్డికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు.

నకిలీ పత్రాలు సృష్టించి భూమి విక్రయం

కౌన్సిలర్ రిమాండ్

అనంతగిరి: నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి మోసం చేసిన కేసులో ఓ కౌన్సిలర్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ టి.శీను తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీ పరిధి శివారెడ్డిపేట శివారులో హైదరాబాద్‌కు చెందిన జమునాబాయి కుటుంబీకుల పేరిట 90ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆ భూమిని ఆనుకుని 6వ వార్డు కౌన్సిలర్ చందర్‌నాయక్‌కు భూమి ఉంది. జమునాబాయికి చెందిన కొంత భూమిని కొన్నేళ్లుగా కౌన్సిలర్ తండ్రి తదనంతరం కౌన్సిలర్ కౌలుకు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో కౌన్సిలర్ ఆ భూమిని విక్రయించేందుకు 5.20 ఎకరాలను 1996లో జమునాబాయి అగ్రిమెంట్ ఆఫ్ సేల్ డాక్యుమెంట్ తయారు చేసి ఆమెకు డబ్బు చెల్లించినట్లు నకిలీ పత్రాలను సృష్టించాడు. అనంతరం 2009లో తహసీల్దార్ కార్యాలయంలో రికార్డ్ ఆఫ్ రైట్స్(ఆర్ఓఆర్) నకిలీ డాక్యుమెంట్‌లు సృష్టించి అట్టి భూమిని తాండూరుకు చెందిన ఓ వ్యక్తికి విక్రయించాడు. విషయం తెలుసుకున్న జమునాబాయి కుమారుడు గోపిచంద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు విచారణలో కౌన్సిలర్ నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి ఫిర్యాదుదారుడిని మోసం చేసినట్లు తేలడంతో ఆయన్ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు.

రైతులకు చైతన్యమేదీ?

పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్వహించే మనతెలంగాణ–మన వ్యవసాయం కార్యక్రమం నిలిచిపోయింది. సాగులో మెలకువలు, యంత్రరాయితీ, పంటల బీమా తదితర అంశాలపై గతంలో సదస్సులు నిర్వహించేవారు. ఆరేళ్లుగా రైతులకు అధికారుల మధ్య దూరం పెరిగి వారికి సూచనలు, సలహాలు కరువయ్యాయి.

- ఆరేళ్లుగా నిలిచిన కార్యక్రమాలు
- ప్రారంభానికి నోచుకోని 'మన తెలంగాణ – మన వ్యవసాయం'
- పట్టించుకోని అధికారులు



దౌల్తాబాద్: రైతులను సాగుకు సన్నద్ధం చేసేందుకు ప్రభుత్వం 'మన తెలంగాణ–మన వ్యవసాయం' పేరిట రైతు చైతన్య యాత్రలను నిర్వహించే వారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి, మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు చేపడుతుండేవారు.

ఆధునిక పద్ధతులపై అవగాహన కరువు

ఆధునిక పద్ధతులపై అవగాహన లేకపోవడంతో వేసవి సాగులో ఒకే రకం పంట, అధిక మోతాదులో రసాయనిక ఎరువులు వాడుతూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గమనించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతీ సంవత్సరం ఏప్రిల్, మే నెలలో వ్యవసాయ శాఖ అధికారులు రైతు చైతన్య యాత్ర పేరిట గ్రామాలకు వెళ్లి అన్నదాతలకు సాగులో మెళకువలు కల్పించేవారు. అధికారులు బృందాలుగా ఏర్పడి గ్రామాలకు వెళ్లి ఉదయం 7గంటల నుంచి 11గంటల వరకు అంశాల వారీగా అవగాహన కార్యక్రమాలు చేపట్టి రైతుల సంతకాలు సేకరించేవారు. ఇందులో భాగంగా భూసార పరీక్షలపై అవగాహన, పంటల మార్పిడి, పంటలకు మద్దతు ధరలేనప్పుడు ధాన్యం గోదాంలలో నిల్వ చేయడం దానిపై రుణం పొందే విధానం, వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలు, రుణాల సద్వినియోగం, పంటలను ఆశించే చీడపీడల నివారణ, కరువు కోరల్లో చిక్కుకున్నప్పుడు పాడి పశువుల అభివద్ధి, పశుసంవర్ధక శాఖ రాయితీలు, విత్తనోత్పత్తికి ప్రోత్సాహం, విద్యుత్ వినియోగం తదితర విషయాలపై అధికారులు అవగాహన కల్పించేవారు. కానీ ప్రస్తుతం వాటి ఊసేలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు వేదికలు నిర్మించినా..

ఏఈఓ కేంద్రంగా నిర్మించిన రైతు వేదికలు నిరుపయోగంగా మారాయి. వాటిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి వారికి సలహాలు, సూచనలు ఇవ్వాలి కానీ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. రైతుల యాత్రలు నిరంతరంగా సాగేవి కానీ రైతు వేదికల్లో ఇవేమీ జరగడం లేదని.. అన్ని శాఖల అధికారులు రావడం లేదని విమర్శలున్నాయి.

> **ఏఈఓలను సంప్రదించాలి**
>
> రైతులకు ఏవైనా సలహాలు, సూచనలు కావాలంటే సంబంధిత ఏఈఓలను సంప్రదించాలి. వారు ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటారు. తక్షణమే సంప్రదించి సలహాలు తీసుకోవచ్చు. రైతు చైతన్యయాత్రలపై ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదు.
>
> – లావణ్య , ఏఓ, దౌల్తాబాద్

రోడ్డును తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలి

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య


తొలగించిన మెటల్ రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: వెంచర్ కోసం 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం వేసిన మెటల్ రోడ్డును తొలగించిన రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నారాయణపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 234, 233 సర్వేనంబర్‌లో వెంచర్‌కు మెటల్ రోడ్డు అడ్డుగా ఉందని కొందరు రోడ్డును తొలగించారు. విషయం తెలుసుకున్న సీపీఎం నాయకులు బుధవారం తవ్విన రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా రవాణా కోసం వేసిన రోడ్డు తవ్వడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇష్టానుసారంగా ప్రభుత్వం రోడ్లను తొలగిస్తుంటే అధికారులు పట్టించుకోకపోవడం తగదన్నారు. దీని వెనుక అధికార పార్టీ నాయకుల అండదండలున్నాయని ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా వెంచర్ ఎలా చేస్తారని ప్రశ్నించారు. అనుమతులు లేకున్నా విద్యుత్ శాఖ నుంచి స్తంభాలు ఎలా వేస్తారని ప్రశ్నించారు. ఈ విషయమై అధికారులు, నాయకులపై లోకాయుక్తలో ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, లాలయ్య, శేఖర్, జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న సీడీపీఓ కాంతారావు

ఐసీడీఎస్ సీడీపీఓ కాంతారావు

బంట్వారం: బాల్య వివాహల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ కాంతారావు అన్నారు. బుధవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో ఐసీడీఎస్–చైల్డ్ లైన్ 1098 ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ.. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్‌లైన్ 1098, డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. చిన్న వయస్సులో వివాహాలు చేస్తే శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించే వారిపై చట్టపరంగా చర్యలుంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భరత్‌గౌడ్, ఎస్ఐ సత్యనారాయణరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతిదేవి, చైల్డ్‌లైన్ కౌన్సిలర్ రామేశ్వర్, కోట్‌పల్లి, బుగ్గాపూర్ సర్పంచ్‌లు విజయలక్ష్మి, లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో అడ్డాకూలీ మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల సీఐ రవికుమార్ తెలిపిన వివరాలు.. షాద్‌నగర్‌కు చెందిన కావలి రవి(45).. భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి లెనిన్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ప్రతి రోజు అడ్డామీదకు వెళ్లి కిరాయికి మాట్లాడిన చోట కూలి పనులు చేస్తుంటాడు. ఒక్కోసారి పని ఎక్కువుంటే ఇంటికి తిరిగిరాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఎప్పటిలాగే పని కోసం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. రాత్రికి తిరిగి రాలేదు. బుధవారం తెల్లవారుజామున నాదర్‌గుల్ సమీపంలోని గ్రీన్‌హోమ్స్ కమాన్ వద్ద ఇసుకలో రవి మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడు రవి ఉబ్బస వ్యాధితో బాధపడుతుండేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.


రవి మృతదేహం

కళ్లల్లో కారం చల్లి పుస్తెలతాడు అపహరణ

గంటలో దొంగను పట్టుకున్న యాచారం పోలీసులు

యాచారం: మహిళ కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెలతాడును గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. ఈ ఘటన మండల కేంద్రమైన యాచారం బుధవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. సీఐ లింగయ్య తెలిపిన వివరాలు.. యాచారానికి చెందిన పెరుమల్ల ప్రేమలత మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఇంటి వద్ద మరో మహిళతో మాట్లాడుతోంది. అదే సమయంలో మొహానికి బట్ట కట్టుకున్న వ్యక్తి వచ్చి ప్రేమలత కళ్లల్లో కారం చల్లి ఆమె మెడలోని రెండు తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. బాధితురాలు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమలత.. దొంగ ఆనవాళ్లు చెప్పడంతోపాటు ఫలానా వ్యక్తే అయి ఉంటాడని అనుమానం వ్యక్తం చేయడంతో ఆ దిశగా పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తానే దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బుధవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందించే విలేకరులకు ప్రెస్‌క్లబ్ భవనం వేదికగా ఉంటుందన్నారు. మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ భవనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఇందుకు దాతలు సహకరించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంపీడీఓ మహేష్‌బాబు, జెడ్పీటీసీ స్వరూప, స్థానిక సర్పంచ్ స్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో అన్నదాత బలవన్మరణం


శంకరయ్య(ఫైల్)

పరిగి: అప్పులు తీర్చే మార్గంలేక ఓ అన్నదాత పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని పోల్కంపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన శంకరయ్య(38) తనకున్న పొలంతో పాటు కౌలుకు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఐదేళ్లుగా పంట దిగుబడి సక్రమంగా లేక సుమారు రూ.18 లక్షల వరకు అప్పు చేశాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక బుధవారం ఉదయం గ్రామ శివారులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెల్ఫీ వీడియోను గ్రామ వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేశాడు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరకుని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు సంతానం. భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

టెంట్‌కు నిప్పంటించిన దుండగులు

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఎన్కెపల్లి గ్రామంలో గుర్తు తెలియని దుండగులు టెంట్‌ను దగ్ధం చేశారు. ఈ ఘటన మోమిన్‌పేట పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. ఎంకేపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి ప్రభు తన కుమారుల పుట్టోళ్ల(ధోతీ వేడుక) కార్యక్రమానికి గ్రామంలోని దుర్గమ్మ, పోచమ్మ ఆలయాల వద్ద టెంట్ వేసుకున్నాడు. మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు టెంట్‌కు నిప్పంటించారు. దీంతో టెంట్ కాలిబూడిదయింది. సుమారుగా రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

నాటుసారా విక్రయిస్తున్న మహిళపై కేసు

ధారూరు: గుట్టుగా నాటుసారా తయారీ చేసి విక్రయిస్తున్న మహిళను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కుమ్మర్‌పల్లి గ్రామంలో నాటుసారా తయారు చేసి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. పోలీసులు గ్రామానికి చెందిన నెనావత్ ఫన్నీబాయి ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. నిషేధిత నాటుసారా సీసాలను స్వాధీనం చేసుకున్నారు. లీటరు సారాను రూ.200 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని ఎస్ఐ చెప్పారు. నమూనాలను సేకరించి రసాయన విశ్లేషనకు పంపించామని, నిందితురాలు ఫన్నీబాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గుర్తు తెలియని బైక్ ఢీ..

వ్యక్తికి గాయాలు


గాయాలపాలైన దస్తయ్య

పరిగి: గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని నస్కల్ గ్రామానికి చెందిన గంటి దస్తయ్య పని నిమిత్తం పరిగి పట్టణ కేంద్రానికి వచ్చాడు. బస్టాండ్ సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి బైక్‌తో అతన్ని బలంగా ఢీకొట్టి వెళ్లిపోయాడు. దీంతో దస్తయ్యకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఆయన్ను నగరానికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగానే ఉందని గ్రామస్తులు తెలిపారు.


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు అరుణదేశు

'భగీరథ'.. ఊరూరా వ్యథ!

తాగునీటి సమస్యపై గళమెత్తిన సభ్యులు

బొంరాస్‌పేట: మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్యలున్నాయని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ముక్తకంఠంగా తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ హేమీబాయి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా మిషన్ భగీరథ పథకం అమలుపై చర్చ కొనసాగింది. బొంరాస్‌పేటలోని 5,6 వార్డుల్లో భగీరథ నీరు సరఫరా అవ్వడం లేదని ఎంపీటీసీ తెలిపారు. మాలెకాడిబావి పల్లె, తండాల్లో నిత్యం ట్యాంకులు నిండి నీరు వృథాగా పోతోందన్నారు. బోడబండ తండాకు, మహంతీపూర్‌లో 50 కుటుంబాలకు నీటి సరఫరా లేదన్నారు. గిర్కబావితండాలో ట్యాంకులో ఎలుకలు చనిపోవడంతో వినియోగించడం లేదన్నారు. ఊరెనికి తండా, దుప్‌చర్లలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, ఎన్కేపల్లిలో నేటికి పనులు పూర్తి కాలేదని సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకువచ్చారు. మిషన్ భగీరథ నిర్వహణ బాధ్యత సర్పంచులదేనని ఏఈ రాఘవేందర్ అన్నారు. నెలలో మూడుసార్లు వాటర్ ట్యాంకులు శుభ్రం చేయాలని, ప్రతీ గ్రామంలో ప్రత్యామ్నాయ వనరులుండాలని సూచించారు. జెడ్పీటీసీ అరుణదేశు చౌహాన్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో భగీరథ నీరునే తాగేలా అవగాహన కల్పించాలన్నారు.

ఆయా, టీచర్ మృతితో..

మేడిచెట్టు తండాలో ఆయా టీచర్ ఇద్దరు చనిపోవడంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ సక్రమంగా లేదన్నారు. లబ్ధిదారులకు సరుకులు అందడంలేదన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ఇంటిమీదుగా ప్రమాదకరంగా ఉన్నాయని చెప్పారు. కాగా ట్రాన్స్‌కో ఏఈ నాగరాజు షిఫ్టింగ్ చార్జీలు ప్రజలే భరించాలని చెప్పారు. వ్యవసాయ శాఖనుంచి రాయితీపై జీలుగ, జనుము విత్తనాలు అందజేస్తున్నామని ఏఓ పద్మావతి తెలిపారు. ఉపాధి హామీ పథకంలో రోడ్ల నిర్మాణానికి, ఇంకుడు గుంతలు, టాయిలెట్స్ నిర్మించుకోవడానికి అవకాశం ఉందని ఏపీఓ తెలిపారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ డీఈ కిరణ్, పంచాయతీరాజ్ డీఈ లక్ష్మణ్‌రావు, డాక్టర్ హేమంత్‌కుమార్, ఇన్‌చార్జి తహసీల్దారు రవి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాల నివారణకు నిఘా

ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి


పరిగి ఫెర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ తదితరుతులు

పరిగి: కల్తీ విత్తనాల నివారణకు పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని ఏడీఏ డీఎస్ లక్ష్మీకుమారి అన్నారు. బుధవారం ఆమె పట్టణ కేంద్రంలోని ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. అనంతరం డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, నియోజకవర్గ పరిధిలోని ఎస్సైలతో సమావేశమయ్యారు. కల్తీ విత్తనాల నివారణకు పోలీసుల సహకారం కోరారు. అనంతరం ఏడీఓ మాట్లాడుతూ.. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లైసెన్సులు లేకుండా విత్తనాలు అమ్మితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో కల్తీ విత్తనాలను అరికట్టేందుకు ప్రతీ ఒక్కరి సహకారం అవసరమన్నారు. గ్రామాల్లో ఎక్కడైన కల్తీ విత్తనాలు విక్రయిస్తే వెంటనే పోలీసులకు, వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. నిషేధిత మందులు, నకిలీ విత్తనాలు విక్రయిస్తే వారి లైసెన్సులు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయధికారి ప్రభాకర్‌రెడ్డి, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు ఉప ఎన్నిక 'హస్త'గతం


ఉపసర్పంచ్ రమేశ్‌ను సన్మానిస్తున్న పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు

ఉప సర్పంచ్‌గా రమేశ్

పెద్దేముల్: మండల పరిధిలోని ఇందూరులో ఉప సర్పంచ్ స్థానానికి బుధవారం ఉప ఎన్నిక నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన వార్డు మెంబర్ గడిసింగపురం రమేశ్ ఎన్నికయ్యారు. గతంలో ఉప సర్పంచ్‌గా విధులు నిర్వహించిన లాలప్ప నెలరోజుల క్రితం మృతి చెందాడు. దీంతో జాయింట్ చెక్‌పవర్‌కోసం డీపీఓ తరుణ్‌కుమార్ ఆదేశాల మేరకు ఇందూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పద్మమ్మ అధ్వర్యంలో ఎంపీఓ షేక్‌సుస్మా ఎన్నికకు ఏర్పాటు చేశారు. ఎనమిది మంది వార్డు సభ్యుల్లో ముగ్గురు ఎన్నికల లెక్కలు చూపకపోవడంతో వారిని తొలగించారు. మిగిలిన ఐదుగురిలో ముగ్గురు వార్డు సభ్యులు రమేశ్‌కు మద్దతు తెలిపారు. మరో ఇద్దరు మిగిత ఐదు మందితో ఎన్నిక నిర్వహించగా గడిసింగపురం రమేష్‌కు ముగ్గురు వార్డు సభ్యులు, పెంటమ్మకు ఇద్దరు మద్దతు తెలిపారు. దీంతో రమేశ్ ఎన్నికను ఎంపీఓ షేక్‌సుస్మా ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు. అనంతరం ఉప సర్పంచ్‌గా ఎన్నికైన రమేశ్‌ను సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

సివిల్స్ ర్యాంకర్ సుస్మితకు సన్మానం


సుస్మితను సన్మానిస్తున్న వైఎస్సార్ టీపీ నేత ఇబ్రహీం తదితరులు

షాద్‌నగర్ రూరల్: సివిల్ సర్వీసెస్ –2022 తుది ఫలితాల్లో పట్టణానికి చెందిన ఇప్పలపల్లి సుస్మిత ఆల్ ఇండియా 384వ ర్యాంకు సాధించడంతో బుధవారం పలువురు నేతలు ఆమెను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం, మున్సిపల్ చైర్మన్ కే నరేందర్, కౌన్సిలర్ కే మహేశ్వరి, పీసీసీ సభ్యుడు కే శ్రీనివాస్‌గౌడ్ సుస్మితను సన్మానించారు. స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన సుస్మిత ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల ఆశయానికి అనుగుణంగా ఎంతో కష్టపడి సివిల్స్ ర్యాంకు సాధించడం హర్షణీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని వారు ఆకాంక్షించారు.

ఔటర్‌పై కారులో మంటలు

తృటిలో తప్పించుకున్న డ్రైవర్


కారుకు వ్యాపించిన మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

శంషాబాద్ రూరల్: రోడ్డుపై వెళ్తున్న కారులో అకస్మాతుగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయగా..కారు నడుపుతున్న డ్రైవర్ ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నాడు. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆలీకోట్‌తండాకు చెందిన జెర్పుల రవి బుధవారం రెనాల్ట్ డస్టర్ కారులో ఔటర్ మీదుగా నార్సింగి నుంచి శంషాబాద్ వస్తున్నాడు. కిషన్‌గూడ సమీపంలోకి రాగానే కారులో మంటలు చెలరేగాయి. గమనించిన రవి కారును కాపి కిందకు దిగారు. కొద్ది సేపటికే కారులో మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.